క్లుప్తంగా

వరద బాధితులకు మెరుగైన వైద్య సేవలు



అప్పనపల్లిలో వరద పరిస్థితిపై సమీక్షిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర

మామిడికుదురు: వరద బాధితులకు మెరుగైన వైద్య సేవలందించే దిశగా ముందస్తు కార్యాచరణ చేపట్టామని డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎం.దుర్గారావుదొర తెలిపారు. ఆయన సోమవారం అప్పనపల్లి, పెదపట్నంలంక, పాశర్లపూడి గ్రామాల్లో పర్యటించారు. గర్భిణులు, బాలింతలు, బెడ్ రిడెన్ పేషెంట్ల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల నుంచి వారిని ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. గోదావరి వరద ప్రభావిత ప్రాంతాల్లో విషసర్పాల బెడద తీవ్రంగా ఉంటుందని, ఎవరైనా పాము కాటు బారిన పడిన పక్షంలో తక్షణం వారికి వైద్య సేవలందించే దిశగా యాంటీ స్నేక్ వీనమ్‌ను సిద్ధంగా ఉంచామన్నారు. అత్యవసర సమయాల్లో అందించేందుకు మందులు సిద్ధంగా ఉంచామని తెలిపారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఎప్పటికప్పుడు తాగునీటి పరీక్షలు చేయాలని, క్లోరినేషన్ చేయించాలని ఆదేశించామన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు గెద్దం మంగాలక్ష్మి, సుందరనీడి చిన్ని, సీహెచ్‌ఓ సత్యవతి, పీహెచ్‌ఎస్ నారాయణమ్మ, హెల్త్ అసిస్టెంట్లు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సురక్షిత ప్రాంతానికి తరలి రావాలి



పాశర్లపూడి కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవవర్ధన్ రెడ్డి

మామిడికుదురు: వరద బాధితులు సురక్షిత ప్రాంతానికి తరలి రావాలని పాశర్లపూడిలంక సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఇన్‌చార్జ్ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు సూచించారు. పాశర్లపూడిలంక శ్రీరామ్‌పేట ప్రాంతంలో సోమవారం పర్యటించి పసువులను కరకట్ట పైకి తరలించాలని, గర్భిణులు, బాలింతలు, మంచం పట్టిన వృద్ధులను సురక్షిత ప్రాంతానికి తరలి రావాలని కోరారు. వరద ఉధృతి క్రమేపీ పెరుగుతున్న తరుణంలో బాధితులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ, పశు సంవర్ధక శాఖ, ఉపాధి హామీ పథకం ఉద్యోగులు పాల్గొన్నారు. మండల ప్రత్యేకాధికారి కేశవవర్ధన్‌రెడ్డి పాశర్లపూడి కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని పరిశీలించారు. ఉద్యోగులకు తగు సూచనలు చేశారు. కాజ్‌వేకు ఇరువైపులా సర్వే కర్రలు పాతించి వాటికి ఎర్రజెండాలు ఏర్పాటు చేయించారు.

నిధుల దుర్వినియోగం ఆరోపణపై విచారణ



మొగలికుదురు పంచాయతీలో విచారణ చేస్తున్న డీపీఓ రాంబాబు

మామిడికుదురు: మొగలికుదురు పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధులు దుర్వినియోగం అయ్యాయని పంచాయతీ పాలక వర్గ సభ్యులు, స్థానికులు చేసిన ఫిర్యాదుపై డీపీఓ డి.రాంబాబు సోమవారం విచారణ చేపట్టారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కడి అరుణకుమారితో పాటు పంచాయతీ కార్యదర్శి, ఉప సర్పంచ్, వార్డు సభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. బ్లీచింగ్ కొనుగోలు, వీధి లైట్లు ఏర్పాటు పేరిట నిధులు దుర్వినియోగం చేశారని, కంప్యూటర్ ఆపరేటర్‌తో పాటు పారిశుధ్య కార్మికుడి బ్యాంకు ఖాతాలకు పంచాయతీ నిధులు మళ్లింపు వంటి అక్రమాలు జరిగాయన్నారు. వీటిపై సమగ్రంగా విచారణ జరిపించాలని కోరారు. ఆరోపణల నేపథ్యంలో పంచాయతీ రికార్డులను డీపీఓ తన వెంట తీసుకువెళ్లారు. 15 రోజుల్లో విచారణ పూర్తి చేస్తామని డీపీఓ రాంబాబు తెలిపారు. అనంతరం పంట కాలువ పక్కన ఆక్రమణలను ఆయన పరిశీలించారు. ఆక్రమణదారులకు తక్షణం నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండండి

రావులపాలెం: వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన ఉండాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, డాక్టర్ రౌతు ఈశ్వరరావు సూచించారు. సోమవారం స్థానిక రౌతు కాశి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో వచ్చే అంటు వ్యాధులపై ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనేది ప్రజలకు వివరించారు. తాగునీరు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండకపోవడం వల్ల వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.

పెరుగుతున్న వరద

- లంక గ్రామాల్లో అలజడి
- బిక్కుబిక్కుమంటున్న ప్రజలు
- నీటమునిగిన పశుగ్రాసం, ఉద్యాన పంటలు



అప్పనపల్లి-పెదపట్నంలంక మధ్యలోని పాటురేవును ముంచెత్తిన వరద

మామిడికుదురు: గోదావరి వరద లంక గ్రామాల ప్రజల్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తోంది. రెండు రోజుల నుంచి పెరుగుతున్న గోదావరి వరద లంక గ్రామాల ప్రజల్లో గుబులు రేపుతోంది. ధవళేశ్వరం వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను దాటి రెండో ప్రమాద హెచ్చరిక దిశగా పెరుగుతున్న వరద లంక గ్రామాల ప్రజలకు ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. పాశర్లపూడి బ్రిడ్జి వద్ద గోదావరి వరద నీరు క్రమేపీ పెరుగుతూ పరవళ్లు తొక్కుతోంది. పాశర్లపూడి కరకట్ట దిగువన అప్పనపల్లి కాజ్‌వేను వరద చుట్టుముట్టింది. మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు దిగువన కాజ్‌వే వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి-పెదపట్నంలంక సరిహద్దులోని పాటురేవు ముంపుబారిన పడడంతో ఆ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. గోదావరి వరదతో అప్పనపల్లి, బి.దొడ్డవరం, పెదపట్నంలంక, పెదపట్నం గ్రామాలతో పాటు పాశర్లపూడి పల్లవపాలెం, పాశర్లపూడిలంక శ్రీరాంపేట ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే లంక గ్రామాల్లో పశుగ్రాసం ముంపునకు గురైంది. అప్పనపల్లి, బి.దొడ్డవరం గ్రామాల్లోని కొబ్బరితోటలు ముంపుబారిన పడ్డాయి. గోదావరి వరద పెరుగుతున్న దృష్ట్యా తీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నీట మునిగిన అయినవిల్లిలంక కాజ్‌వే

అయినవిల్లి: వరద ఉధృతికి మండలంలోని ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం వద్ద కాజ్‌వేపై వరదనీరు ప్రవహిస్తుంది. ఈ కాజ్‌వే పై లంక ప్రాంతవాసులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. నిత్యవసరాలు, పాలు, వ్యవసాయ ఉత్పత్తులు తరలించేందుకు ఈ కాజ్‌వే పైన రహదారిపైనే ప్రజలు ఆధారపడతారు. వరదకు ఈ కాజ్‌వే మునగడంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అత్యవసర పరిస్థితిల్లో ఈ కాజ్‌వేను దాటేందుకు అధికారులు పడవలు ఏర్పాటు చేసేందుకు అంతా సిద్ధం చేసిన తహశీల్దార్ ప్రమద్వర తెలిపారు. అలాగే ముక్తేశ్వరం-కోటిపల్లిరేవులో పంటు ప్రయాణాలు నిలిపివేసిన విషయం తెలిసిందే. కోటిపల్లిరేవులోను, ముక్తేశ్వరం వృద్ధగౌతమిపాయలోను వరద ఉధృతిగా ప్రవహిస్తుంది. లంక గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలు ఇప్పటికే నీట మునిగాయి. కూరగాయపంటలు, కోకో, అరటి, తమలపాకులు ఇలా పలుపంటలు వరదనీట మునిగాయి. లంక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పి.గన్నవరం నియోజకవర్గం బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ చీకురుమిల్లి వెంకటేశ్వరరావు అన్నారు. ఆయన మాట్లాడుతూ కూటమి కార్యకర్తలు ప్రజలకు అండగా ఉండి ఎప్పటికప్పుడు సేవలందిస్తారన్నారు.

లంక గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలి

ఆలమూరు: ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద రోజురోజుకూ తీవ్ర తరమవుతుంది. ధవళేశ్వరం బ్యారేజీ వద్ద నీటిమట్టం గంట గంటకు పెరుగుతూ ఉగ్రరూపం దాల్చుతున్న దృష్ట్యా మండలంలోని అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు మండల ప్రత్యేక అధికారి, వ్యవసాయ శాఖ ఏడీఏ కె.నాగేశ్వరరావు, ఎస్సై ఎల్.శ్రీను నాయక్, తహసీల్దార్ డి.అనిల్ కుమార్, ఎంపీడీవో మేరీరోజ్ మండలంలోని నదీ పరీవాహక ప్రాంతమైన బడుగువానిలంకలో సోమవారం పర్యటించి వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలతో కలసి వరదలను ఎదుర్కొనేందుకు విధి విధానాలపై సమీక్షించారు. గర్భిణులు, బాలింతలు ఉన్నట్లయితే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలని సూచించారు. లంక గ్రామాల ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. వరద తీవ్రతను బట్టి లోతట్టు ప్రాంత ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. అనంతరం మూలస్థాన అగ్రహారం, జొన్నాడ లంక ప్రాంతాల్లో పర్యటించి వరద పరిస్థితిని సమీక్షించారు. సర్పంచ్ దూలం వెంకటలక్ష్మి, దూలం రాంబాబు, పొలూరి గోవిందరాజు, పంచాయతీ కార్యదర్శి యు.సుప్రియ, మహిళ కార్యదర్శి డి.కృష్ణవేణి, రెవెన్యూ, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బడుగువానిలంకలో వరద తీవ్రతపై గ్రామస్తులతో సమీక్షిస్తున్న అధికారుల బృందం

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: వరద ఉధృతి పెరుగుతుండటంతో లంక గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని లంక గ్రామాలను వరద చుట్టుముడుతోంది. లంకల్లోని ఉద్యాయన పంటలు నీట మునుగుతున్నాయి. లంక భూముల్లోని పశువులను రైతులకు ఏటిగట్లపైకి తరలిస్తున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక, బూరుగులంక, అరిగెలవారిలంక గ్రామాల ప్రజలు వరద ఉధృతిలో ఇంజన్ పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే సరిహద్దు జిల్లాకు చెందిన పెదమల్లంక, ఆనగర్లంక, సిర్రావారిలంక గ్రామాల ప్రజలు మండలంలోని యర్రంశెట్టివారిపాలెం నుంచి పడవలపై ప్రయాణిస్తున్నారు. చాకలిపాలెం శివారు కనకాయలంక కాజ్‌వేపై వరద ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఇంజన్ పడవలు ఏర్పాటు చేశారు. ఎడతెరిపి లేని వర్షాల కారణంగా పడవలపై ప్రయాణించే లంక గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఊడిమూడిలంక, జి.పెదపూడిలంక గ్రామాల్లోని ఇద్దరు గర్భిణులను సీడీపీఓ వెంకటేశ్వరి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ప్రభుత్వాస్పత్రికి తరలించారు. తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ త్రిశూలపాణి, వివిధ శాఖల అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

వరద తాకిడి ప్రాంతాల్లో పర్యటన

సఖినేటిపల్లి: ధవళేశ్వరం బ్యారేజీ వద్ద సోమవారం వరద ఉధృతి నేపథ్యంలో మండలంలో వరద తాకిడికి గురయ్యే ప్రాంతాల్లో అధికారులు పర్యటించారు. ఈ మేరకు మండల ప్రత్యేకాధికారి సిద్ధార్థ వర్ధన్, ఎంపీడీవో పీవీ సత్యనారాయణ, తహసీల్దార్ సీహెచ్ పెద్దిరాజు, డీటీ సీహెచ్ భాస్కర్ పర్యటించారు. అప్పనరామునిలంక, సఖినేటిపల్లిలంక, సఖినేటిపల్లి లాకుపేట, సఖినేటిపల్లి గీతామందిరం, టేకిశెట్టిపాలెం ఏరియాల్లో పరిస్థితులను అంచనా వేశారు. ఆయా ప్రాంత ప్రజలకు ముందస్తు జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. పంచాయతీ కార్యదర్శి కొండా సూరన్న, వీఆర్వోలు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆలమూరు: గ్రామానికి చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడలో ఆదివారం జిల్లా స్థాయిలో అండర్-11 బాలుర విభాగంలో నిర్వహించిన చదరంగం పోటీల్లో ఆలమూరుకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. అందులో పితాని ధ్యాన సత్యకార్తీక్ (ప్రథమ), బాలికల విభాగంలో గెద్దాడ దేవి అక్షయ (ప్రథమ) స్థానాలు సాధించారు. ఈ నెల 27, 28 తేదీల్లో భీమవరంలో జరగబోయే రాష్ట్రస్థాయి చదరంగం పోటీల్లో పాల్గొంటారని కోచ్ రాంప్రసాద్ పేర్కొన్నారు.



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నలుగురు పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి



ఆర్‌వీవీఎన్ సత్యనారాయణ



యు.రేణుక



పి.రాజు



కె.సుప్రియ

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న నలుగురు పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు లభించాయి. మండలంలోని నర్శిపూడి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆర్‌వీవీఎన్ సత్యనారాయణ, చెముడులంక పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న యు.రేణుక, మూలస్థానం అగ్రహారం కార్యదర్శిగా పనిచేస్తున్న పి.రాజు, బడుగువానిలంక కార్యదర్శిగా పనిచేస్తున్న కె.సుప్రియ ఈ పదోన్నతి లభించిన వారిలో ఉన్నారు. కార్యదర్శి గ్రేడ్-3 నుంచి గ్రేడ్-2 కార్యదర్శిగా పదోన్నతులు సాధించిన ఈ కార్యదర్శులను ఆయా గ్రామాల ప్రజలు, ప్రజా ప్రతినిధులు అభినందించారు.

ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ రావిరాల మహేష్‌కుమార్

అయినవిల్లి/పి.గన్నవరం: ఎగువన్న కురుస్తున్న వర్షాలకు గోదావరి నది ఉధృతిగా ప్రవహిస్తున్న నేపథ్యంలో లంక గ్రామాల ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా రావిరాల మహేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఆయన సోమవారం అయినవిల్లి మండలంలోని ముక్తేశ్వరం-అయినవిల్లిలంక కాజ్‌వే వద్ద, వృద్ధగౌతమినది పాయలోని వరద పరిస్థితిని సమీక్షించారు. కలెక్టర్ మహేష్‌కుమార్ స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అధికారులు వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ వరద వల్ల ఏర్పడే నష్టాన్ని తగ్గించాలని ఆదేశించారు. గ్రామ స్థాయి, మండల స్థాయి అధికారులు లంక గ్రామాల్లో ఉంటూ ప్రజలకు అండగా నిలవాలన్నారు. కాజ్‌వే వద్ద రహదారిపై సుమారు ఆరు నుంచి ఎనిమిది అడుగుల మేర వరద ప్రవహిస్తుందని అన్నారు. అత్యవసర సమయాల్లో కాజ్‌వేపై రాకపోకలు కొనసాగించేందుకు పడవలు ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ ప్రమద్వర, ఏపీఈపీడీఎల్ ఏడీ అన్నవరం, స్థానిక ఎస్సై వి.రాజేష్‌కుమార్ తదితరులు ఉన్నారు. పి.గన్నవరం మండలంలోని జి.పెదపూడి రేవు నుంచి కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణతో కలసి కలెక్టర్ పడవపై లంకలోకి వెళ్లారు. ఆయన మాట్లాడుతూ రెండో ప్రమాద హెచ్చరిక దాటి వరద ప్రవహిస్తే సహాయక చర్యలు ముమ్మరం చేస్తామన్నారు. దీనిపై అధికార యంత్రాగానికి తగు ఆదేశాలు ఇచ్చామన్నారు.



ముక్తేశ్వరం-అయినవిల్లిలంక ఎదురుబిడెం కాజ్‌వే వద్ద వరద పరిస్థితిని సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ తదితరులు

జిల్లాలోని 45 లంక గ్రామాలకు గాను ఆరు చోట్ల కనెక్టివిటీ తెగిపోవడంతో ఆయా ప్రాంతాల్లో బోట్లు ఏర్పాటు చేసి లైఫ్ జాకెట్లు, ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. పునరావాస కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ముంపు బాధితుల కోసం జిల్లా కేంద్రంలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాన్ని అందుబాటులో ఉంచామన్నారు. ముంపునీరు సముద్రంలోకి దిగేందుకుగాను కూనవరం, వాసాలతిప్ప స్ట్రెయిట్‌కట్స్‌లో సిల్టు తొలగిస్తున్నట్టు చెప్పారు. వరద ముంపు గ్రామాల ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదని, అధికారులంతా అందుబాటులో ఉంటారన్నారు. ఏ సహాయం అవసరమైనా అధికారులను సంప్రదించాలన్నారు. కలెక్టర్ వెంట కొత్తపేట ఆర్డీఓ జీవీవీ సత్యనారాయణ, తహసీల్దార్ షేక్ హుస్సేన్, ఎంపీడీఓ సీహెచ్ త్రిశూలపాణి, సర్పంచ్‌లు నూకపెయ్యి ప్రసన్నకుమార్, దంగేటి అన్నవరం పాల్గొన్నారు.

తైక్వాండోలో విజేతలకు బంగారు పతకాలు



తైక్వాండో పోటీల్లో మెడల్స్ సాధించిన విద్యార్థులు

అంబాజీపేట: తైక్వాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస్ తైక్వాండో క్లబ్‌కు చెందిన విద్యార్థులు గోల్డ్ మెడల్స్ సాధించారని జిల్లా తైక్వాండో కార్యదర్శి, సీనియర్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చిన 27 మంది విద్యార్థులను అంబాజీపేట జెడ్పీ హైస్కూల క్రీడా ప్రాంగణంలో సోమవారం అభినందించారు. ఈ నెల 21న కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో 30వ ఇంటర్ తైక్వాండో చాంపియన్ షిప్ 2024 జిల్లా స్థాయి పోటీలు నిర్వహించినట్లు త్రిమూర్తులు తెలిపారు. సబ్ జూనియర్స్ విభాగంలో కె.శాలిని, జి.లాహొతీ తేజ, జీజే లేఖన, ఎం.మౌనిక, ఎ.పవన్ తేజ గోల్డ్ మెడల్స్‌ను, ఎం.వినూత్న, ఆర్.సర్వం, ఎం.షణ్ముఖసాయి, ఐ.డానిల్, వై.ఈషా, డి.గిరిజ, సీహెచ్ హర్షిత, సీహెచ్ దీపక్‌పాల్ సుధీర్‌లు సిల్వర్ మెడల్స్‌ను, ఎం.హర్షదీపక్, కె.ఆద్య, జె.షైని, జె.శామ్యూల్, ఆర్.జోష్ణ, ఎస్.కావ్య, ఈ.బంగారయ్య, ఈ.ఆంజనేయులు బ్రాంజ్ మెడల్స్ సాధించారన్నారు. క్యాడెట్ విభాగంలో పి.శరణ్య, కె.కె.సాయిదుర్గ, బి.హేమరితక్‌లు గోల్డ్ మెడల్స్‌ను, ఎంఎల్‌డీ.నూకేష్, జి.పూజితదేవిలు బ్రాంజ్ మెడల్స్‌ను కైవసం చేసుకున్నారన్నారు. మెడల్స్‌ను సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం కడలి సాయిరామ్, పీడీ కె.ఆదిలక్ష్మి, సీనియర్ కోచ్ కె.సత్యనారాయణ, కేవీ సత్యనారాయణ, నేషనల్ రిఫరీస్ పి.మణికంఠ, భార్గవి, ఏబీ చైతన్య, కె.వైష్ణవి, ఆదిత్య, డి.రాఘవేంద్రలు అభినందనలు తెలిపారు.

వేగంగా రొయ్యల పట్టుబడులు

సఖినేటిపల్లి: ధవళేశ్వరం వద్ద వరద ఉధృతి క్రమేపీ పెరుగుతున్న తరుణంలో సోమవారం ముందుస్తు జాగ్రత్తగా మండలంలో గోదావరి పాయ వెంబడి సాగు చేస్తున్న రొయ్యల చెరువుల్లోని రొయ్యలను ఆక్వా రైతులు ఆదరాబాదరా పట్టుబడుల్లో నిమగ్నమయ్యారు. ప్రధానంగా ఏటిగట్టుకు పూర్తిగా దిగువన టేకిశెట్టిపాలెం వైపు గోదావరి పాయకు చేరి సాగు చేస్తున్న ఆక్వా చెరువుల్లో 70 కౌంటుకు వచ్చిన రొయ్యలను పట్టుబడి పట్టి హుటాహుటిన లారీలకు ఎగుమతి చేస్తున్నారు. అలాగే ఈ గోదావరి పాయకు చేరి అటు అప్పనరామునిలంక, ఇటు టేకిశెట్టిపాలెం వైపున ఉన్న కొబ్బరి తోటలు, పల్లపు ప్రాంతాల్లోకి వరద నీరు క్రమేపీ చేరుతోంది. గోదావరి పాయకు చేరి అప్పనరామునిలంక శివారు కొత్తలంకలో నెహ్రూ సీసీఎఫ్ సొసైటీ సాగు భూముల్లోకి వరద నీరు పోటెత్తుతోంది. సఖినేటిపల్లిలో గోదావరి పాయపై నిర్మించిన కాజ్ వేను వరద నీరు తాకుతోంది. వరద ఉధృతి కారణంగా వశిష్ఠ గోదావరిలోకి వేటకు వెళ్లే బోట్లు ఈ పాయలో సేదతీరుతున్నాయి. సఖినేటిపల్లి లాకుల వద్ద నుంచి వరద నీరు పి.గన్నవరం ప్రధాన పంట కాలువలోకి వెనక్కి రాకుండా ఉండేందుకు లాకు తలుపులను సిబ్బంది బంద్ చేశారు. ఇక్కడ లాకుపేటలోని గోదావరి పాయ వెంబడి ఉన్న నివాస గృహాలకు చేరి ఉన్న రహదారులను వరద నీరు తాకుతోంది. వీటితో పాటు వశిష్ఠ గోదావరి మీదుగా వరద నీరు డ్రెయిన్లలోకి పోటెత్తకుండా ఉండేందుకు అంతర్వేది ఏటిగట్టుకున్న మూడు అవుట్‌ఫాల్ స్లూయిజ్‌లను సిబ్బంది పర్యవేక్షిస్తున్నారు.



ఆక్వా చెరువుల్లో పట్టుబడి పడుతున్న 70 కౌంట్ రొయ్యలు



సఖినేటిపల్లి గోదావరి పాయపై నిర్మించిన కాజ్ వేను తాకిన వరద నీరు

నిత్యాన్నదాన పథకానికి రూ.10 వేల విరాళం



దాత రవికుమార్‌కు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ ప్రధానార్చకుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆత్రేయపురం మండలం లొల్లకు చెందిన వాడపల్లి రవికిరణ్ సోమవారం రూ.10 వేలు విరాళంగా అందజేశారు. ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకులు అయినవిల్లి సూర్యనారాయణమూర్తికి అందజేశారు. దాతను స్వామి శేషావస్త్రాలతో సత్కరించి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను పలువురు అభినందించారు.

సామాన్యులను విస్మరిస్తే ప్రతిఘటన తప్పదు

ఆలమూరు: పాలకులు సామాన్య ప్రజలను విస్మరిస్తే ప్రతిఘటనను ఎదుర్కోక తప్పదని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రగతిశీల ప్రజాసంఘాల నాయకులు అన్నారు. జిల్లా కమ్యూనిస్టు పార్టీ నాయకులు, ప్రముఖ హోమియో వైద్యుడు చల్లా వెంకట్రావు 16వ వర్ధంతి సందర్భంగా ఆలమూరులో సంగమం సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో పలు సామాజిక అంశాలపై సదస్సును నిర్వహించారు. వేదిక నిర్వాహకులు డాక్టర్ చల్లా రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వెంకట్రావుకు డాక్టర్ మెహర్ ప్రసన్న, ప్రజాసంఘాల నాయకులు నివాళి అర్పించారు. సాహితీవేత్తలు కట్టా కృష్ణారావు, పెద్దింశెట్టి రామకృష్ణారావు మాట్లాడుతూ మానవ విలువలను పెంపొందించే దిశగా అధ్యయనం చేసేందుకు స్టడీ సర్కిల్స్ నిర్వహించాలన్నారు. ప్రపంచీకరణ ప్రభావంతో సామాన్యుల ఆదాయ వ్యయాలు కుటుంబాలను ఛిద్రం చేస్తున్నాయని మార్పు సంస్థ నాయకులు రాజేంద్ర అన్నారు. ఉపాధ్యాయ నాయకులు మాట్లాడుతూ మానసిక వికాసం లక్ష్యంగా విద్యాబోధన ఉండాలన్నారు. ప్రేమానందం, శ్యామ్ తదితర ప్రజానాట్య మండలి కళాకారులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో దాసు, శేషగిరి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సదస్సుకు హాజరైన ప్రముఖులు

నల్లచెరువులో శ్రవణం నక్షత్ర పూజలు

అయినవిల్లి: అయినవిల్లి మండలం నల్లచెరువు పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో సోమవారం వేదపండితుల ఆధ్వర్యంలో శ్రవణం నక్షత్ర పూజలు నిర్వహించారు. ఉదయం 6.30 గంటల నుంచి స్వామికి ఆలయ ప్రధానార్చకులు కల్యాణాచార్యుల ఆధ్వర్యంలో రుత్వికులు స్వామికి పంచామృతాభిషేకం, శాంతి కల్యాణ మహోత్సవం వంటి విశేష పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామివారి పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



శ్రీవేంకటేశ్వరుని శ్రవణం నక్షత్ర పూజల్లో పాల్గొన్న భక్తులు

రైతుల ఉరుకులు పరుగులు



అప్పనరామునిలంకలో కొబ్బరికాయలను పడవపై రోడ్డుకు చేరవేసుకుంటున్న రైతులు

సఖినేటిపల్లి: మండలంలో పూర్తిగా ఏటిగట్టుకు దిగువనున్న అప్పనరామునిలంకలో వరి, కొబ్బరి రైతులు ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. గంటగంటకూ ధవళేశ్వరం వద్ద పెరుగుతున్న వరద భయంతో ముందస్తు జాగ్రత్తతో వీరు పడుతున్న ఆరాటం ఇంతా అంతా కాదు. ప్రధానంగా పశువులకు వరదల కారణంగా కొరత వచ్చే ఎండుగడ్డి, పచ్చిరొట్ట భద్రత పరుచుకోవడంలో నిమగ్నమయ్యారు. ఎండుగడ్డిని ట్రాక్టర్లపై సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. అలాగే చేలల్లో పెంచుకున్న పచ్చిరొట్ట కోతలు ముమ్మరంగా చేసుకుంటూ, పచ్చిరొట్టను కూడా భద్రత పరుచుకునే పనిలో ఉన్నారు. వీటికి తోడు దింపులు తీసుకున్న కొబ్బరి కాయలను పడవలపై రోడ్డుకు చేరవేసే పనిలో రైతులు ఉన్నారు.

ముంపు చేలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



ఊడిమూడిలో వరినారు మడులను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్త నందకిషోర్

పి.గన్నవరం: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఊడిమూడిలో ముంపునకు గురైన వరిచేలను జిల్లా ప్రధాన శాస్త్రవేత్త మోకా నందకిషోర్ సోమవారం పరిశీలించారు. ఈ నేపథ్యంలో రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులను ఆయన వివరించారు. విత్తిన 7 నుంచి 30 రోజుల వ్యవధిలో నారుమడి ఐదు రోజుల కంటే ఎక్కువగా నీట మునిగితే నారు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. చేనులో నీటిని పూర్తిగా బయటకు తరలించి ఐదు సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను వేయాలని సూచించారు. ఊడ్చిన చేను ముంపునకు గురయితే నీటికి బయటకు తీసివేసి ఎకరానికి 20 కిలోల యూరియా, 10 కిలోల మ్యూరేట్ ఆఫ్ పోటాష్‌ను బూస్టర్ డోస్‌గా వేయాలని వివరించారు. నీటిని బయటకు తరలించే అవకాశం లేని చేలలో ఆకులపై 2 శాతం యూరియా లేదా పొటాషియం నైట్రేట్ పిచికారీ చేయాలని నందకిషోర్ సూచించారు. ఆయన వెంట జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఏవీఎస్ రాజశేఖర్, జె.మనోహర్, మండల వ్యవసాయ అధికారి కల్యాణ్‌కుమార్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన జెస్సీ

పి.గన్నవరం: కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన 30వ ఇంటర్ క్లబ్ చాంపియన్‌షిప్ త్వైకాండో పోటీల్లో అంబాజీపేట శ్రీనివాస క్లబ్ విద్యార్థిని గిడ్డి జెస్సీ లేఖన బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు చీఫ్ కోచ్ పితాని త్రిమూర్తులు తెలిపారు. జెస్సీ లేఖన పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామానికి చెందిన విద్యార్థిని. బంగారు పతకం సాధించిన జెస్సీని త్వైకాండో నేషనల్ రిఫరీ, స్టేట్ సెక్రటరీ బి.అర్జునరావు, రిఫరీలు భార్గవి, వినూత్న తదితరులు అభినందించారు.